


హిరాకుడ్ జలాశయం

హిరాకుడ్ మరమ్మతులకు రూ.855 కోట్లు

- కాలువలకు మరమ్మతులు
- నివేదికకు ప్రభుత్వ ఆమోదం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: వరదల నియంత్రణ, నీటి పారుదల, పరిశ్రమలు, విద్యుదుత్పత్తి ధ్యేయంగా ఆరు దశాబ్దాల క్రితం సంబల్‌పూర్ చేరువలోని బుర్లా వద్ద మహానదిపై నిర్మాణమైన హిరాకుడ్ జలాశయంలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. పూడిక చేరింది. నీటిపారుదల కాలువలు పనికిరాని మొక్కలు, పూడికలతో అధ్వానంగా మారాయి. దీంతో పంట పొలాలకు నీరందక అన్నదాతలు ఉసూరుమంటున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం హిరాకుడ్ మరమ్మతులకు శ్రీకారం చుట్టింది. ఈమేరకు జలవనరుల శాఖ రూపొందించిన నివేదిక ఆమోదం పొందింది. సోమవారం పనులకు రూ.855 కోట్లు విడుదలయ్యాయి.

మేనిఫెస్టోలో చెప్పారు

ఎన్నికల మేనిఫెస్టోలో హిరాకుడ్ జలాశయం పునరుద్ధరణ అంశాన్ని భాజపా ప్రస్తావించింది. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో దీనిపై కూలంకషంగా చర్చించారు. జలవనరుల శాఖ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి జలాశయం మరమ్మతులకు నివేదిక కోరారు. అనంతరం నిధులు విడుదల కావడంతో ఆధునికీకరణ పనులు, కాలువల విస్తరణ ముమ్మరం కానుంది.

నాలుగేళ్లలోగా పనులు

జలవనరుల శాఖ సిద్ధం చేసిన డీపీఆర్ ప్రకారం నాలుగేళ్లలో (2027-28) పనులు పూర్తిచేస్తారు. పూడిక తీస్తారు. జలాశయం దిగువ కనిపిస్తున్న పగుళ్లు పూడుస్తారు. ఆధునిక తరహాలో ప్లాస్టరింగ్ చేస్తారు. హిరాకుడ్ జలాశయంపై సంబల్‌పూర్, బరగఢ్, సోన్‌పూర్, బౌద్ధ్ జిల్లాల అన్నదాతలు ఆధారపడ్డారు. ఇటీవల కాలంలో కాలువలు అధ్వానంగా మారాయి. దీంతో నీటిపారుదల సక్రమంగా జరగడం లేదు. పంటలు పాడవుతున్నాయి. శాఖ సమర్పించిన నివేదిక ప్రకారం...కాలువల మరమ్మతులు, విస్తరణ పనులు జరుగుతాయి. ప్రతి రైతుకు న్యాయం జరిగేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు రిజర్వాయరు చీఫ్ ఇంజినీరు ఆనందచంద్రసాహు విలేకర్లకు చెప్పారు. నిర్ణీత వ్యవధికి ముందుగా మరమ్మతులు పూర్తవుతాయన్న నమ్మకం ఉందన్నారు.

ఆనకట్ట ప్రధాన సెక్షన్: 4.8 కి.మీ. రిజర్వాయర్ విస్తీర్ణం: 25.8 కి.మీ.

స్పిల్ గేట్లు: 64 క్రష్ గేట్లు: 34 క్యాచ్‌మెంట్ ఏరియా: 83,400 కి.మీ.

తాగునీటి కోసం రాస్తారోకో

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా సన్నొఖెముండి సమితిలోని హటొపద గ్రామస్థులు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని కోరుతూ సోమవారం ఆందోళనకు దిగారు. పలువురు మహిళలు అస్కా-దిగపొహండి ప్రధాన రహదారిపై ఖాళీ బకెట్లు, డబ్బాలు ఉంచి రాస్తారోకో నిర్వహించారు. అధికారులు చేరుకొని మహిళలకు నచ్చజెప్పిన అనంతరం వారు శాంతించారు.



రహదారిపై అడ్డంగా ఖాళీ బకెట్లు, డబ్బాలుంచి మహిళల రాస్తారోకో

కళకళలాడుతున్న శక్తిపీఠాలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలోని తరాతరిణి, సిద్ధ భైరవి, మొహురి కాళువ, మా నారాయణి, మా వ్యాఘ్రదేవి, మా సింహాసిని, వరాహి అమ్మవారు, మా బాలకుమారి తదితర శక్తిపీఠాల్లో దసరా నవరాత్రి పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతిరోజు చండీ స్తోత్ర పారాయణం, షోడశోపచార పూజలు, హోమం తదితరాలు నిర్వహిస్తున్నారు. ఛత్రపురం సమీపాన కొండపై కొలువైన రామచండీ మందిరంలో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఛత్రపురం శాసనసభ్యుడు కృష్ణచంద్ర నాయక్, భాజపా నాయకుడు రామచంద్ర పండా తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మపురంలోని గాయత్రీమాత అలంకరణ




కళ్లికోట సమీపాన నారాయణి శక్తిపీఠంలో పూజలు



ఛత్రపురం సమీపాన రామచండీ మందిరంలో పూజలు చేస్తున్న ఛత్రపురం శాసనసభ్యుడు కృష్ణచంద్ర నాయక్, భాజపా నాయకుడు రామచంద్ర పండా తదితరులు

హరచండీ రూపంలో అమ్మ దర్శనం



భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్ చండీ ఆలయం భక్తుల స్తోత్రాలు, పూజలతో అలరారుతోంది. శుక్లపక్షమి చతుర్థి తిథిని పురస్కరించుకుని సోమవారం అమ్మవారు హరచండీ రూపంలో దర్శనమిచ్చారు. కేంఝర్ జిల్లాలోని సుప్రసిద్ధ శక్తిపీఠం ఘటగాం తారిణి అమ్మవారి సన్నిధిలో షోడశోపచార పూజలు నిర్వహిస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కుబడులు తీర్చుకుంటున్నారు.



హరచండీ రూపంలో కటక్ చండీ

ఘటగాం తారిణి దివ్యమంగళ అవతారం

ఛత్తీస్‌గఢ్ సరిహద్దు జిల్లాలపై నిఘా

- 12 కంపెనీల బలగాలు, హెలికాప్టర్లు కోరిన ముఖ్యమంత్రి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: వామపక్ష ఉగ్రవాద నిర్మూలన ధ్యేయంగా కార్యక్రమాలు అమలు చేస్తున్న తమ ప్రభుత్వం కేంద్ర సాయం కోరినట్లు ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి చెప్పారు. సోమవారం దిల్లీ విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అధ్యక్షతన మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రధాన కార్యదర్శులు, డీజీపీల సమావేశం జరిగింది. హోంశాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎం మోహన్, ప్రధాన కార్యదర్శి మనోజ్ అహూజా, డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి విలేకర్లతో మాట్లాడుతూ ఒడిశా సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లో పెద్ద ఎత్తున మావోయిస్టుల వేట జరుగుతున్నందున వారు రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉందన్నారు. ఇదే విషయం కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. రాష్ట్రంలోని 10 జిల్లాల్లో మావోయిస్టుల కదలికలున్నాయని నువాపద, బౌద్ధ్, కంధమాల్, మల్కాన్‌గిరి, రాయగడ జిల్లాలు ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్నందున గట్టి నిఘా అవసరమన్నారు. గాలింపు ముమ్మరం చేయడానికి వీలుగా 12 కంపెనీల కేంద్ర బలగాలు, ఒక హెలికాప్టర్ రాష్ట్రానికి కేటాయించాలని కోరినట్లు చెప్పారు. 2026 మార్చి నాటికి మావోయిస్టు అన్న పదం వినిపించరాదన్న లక్ష్యానికి చేరువవుతామన్నారు. మావోయిస్టు ప్రభావిత జిల్లాలకు రహదారులు, వంతెనలు, బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ పథకాలు ప్రజల ముంగిళ్లకు చేర్చడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయనున్నామన్నారు. వీటన్నింటికి కేంద్ర సాయం అవసరమని, అన్ని అంశాలు అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లామని మోహన్ తెలిపారు.



మోహన్‌చరణ్ మాఝి

జవానుకు కన్నీటి వీడ్కోలు

భరతమాత రక్షణలో జమ్ము కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న వీర జవాను దసరా సెలవులకు స్వగ్రామానికి వచ్చి తిరిగిరాని లోకాలకు చేరుకున్నాడు. లారీ రూపంలో మృత్యువు ఆయనను పొట్టన పెట్టుకుంది. స్వగ్రామం విషాదంలో మునిగిపోయింది. సోమవారం మధ్యాహ్నం జరిగిన అంతిమయాత్రలో రక్షణ శాఖ అధికారులు గౌరవ వందనం సమర్పించారు. ప్రముఖులంతా పాల్గొన్నారు.

\- న్యూస్‌టుడే, గోపాలపూర్



ఆర్మీ అధికారుల గౌరవ వందనం



కోండ్రి సిద్దార్థరావు (పాతచిత్రం)

గోపాల్‌పూర్ చేరువలోని డీగిపురం గ్రామానికి చెందిన కోండ్రి సిద్ధార్థ్‌రావు (36) రక్షణశాఖ జవాను. కశ్మీరులో విధులు నిర్వహిస్తుండేవారు. దసరా సెలవుల్లో పిల్లలతో గడపడానికి వారం క్రితం స్వగ్రామానికి వచ్చారు. ఆయన భార్య, పిల్లలు బ్రహ్మపురలోని లంజిపల్లి కేశవనగర్‌లో ఉన్నారు. ఆదివారం రాత్రి 16వ నెంబరు రహదారి లంజిపల్లి బైపాస్ వద్ద సిద్ధార్థ్ రోడ్డు పక్కన నిల్చొని ఉన్న సమయంలో లారీ ఆయనపైకి దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డారు. బ్రహ్మపుర ఎమ్కేసీజీ వైద్య కళాశాల ఆసుపత్రిలో చేర్పించినా ఫలితం లేకపోయింది. మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సోమవారం సిద్ధార్థ్ పార్థివదేహానికి పోస్టుమార్టం జరిగింది. తరువాత మృతదేహాన్ని డీగిపురానికి తెచ్చారు. అంతిమయాత్రలో ఆర్మీ అధికారులు, గోపాల్‌పూర్‌కి చెందిన ప్రముఖులంతా పాల్గొన్నారు. మధ్యాహ్నం అధికార లాంఛనాలతో వీర జవాను అంత్యక్రియలు జరిగాయి.

ముగిసిన రాష్ట్రస్థాయి యోగాసనాల పోటీలు



యోగా కుమారి అవార్డు గెలుచుకున్న అదితి మిశ్ర ఆసనం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బ్రహ్మపురలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో రెండు రోజులు జరిగిన 30వ రాష్ట్రస్థాయి యోగాసనాల పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. మొత్తం పోటీల్లో మొదటిస్థానాల్లో నిలిచిన విజేతలకు ప్రత్యేక టైటిళ్ల కోసం పోటీ నిర్వహించారు. తుది పోటీలో వివిధ జిల్లాల క్రీడాకారులు పలు యోగాసనాలతో అందర్నీ ఆకట్టుకున్నారు. ఇందులో 'ఒడిశా యోగా కుమార్'గా కిషాన్ రథ్ (పూరీ), 'యోగా కుమారి'గా అదితి మిశ్ర (పూరీ), 'యోగా శ్రీ'గా ప్రకాష్ బెహరా (మయూర్‌భంజ్)లు కఠినమైన యోగాసనాలు వేసి బహుమతులందుకున్నారు. ఇందులో 8-10, 10-12, 14-16, 18-21, 21-25, 25-30 వయసుల విభాగాలలో కటక్, పూరీ, మయూర్‌భంజ్ జిల్లాల బాలబాలికలు, యువతీయువకులు, సీనియర్‌లు ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారు. ముగింపు కార్యక్రమంలో అర్జున అవార్డు గ్రహీత, అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టరు, ఒడిశా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి కె.రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులందజేశారు. ఈ పోటీల్లో అన్ని విభాగాల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన విజేతలు ఈ నెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు హిమాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న 49వ జాతీయ యోగాసనాల పోటీల్లో పాల్గొనేందుకు స్థానం పొందినట్లు ఒడిశా యోగా సంఘం కార్యదర్శి సీతారాం శర్మ సోమవారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు.



వివిధ విభాగాల్లో బహుమతులతో విజేతలు



యోగా కుమార్ టైటిల్ గెలుచుకున్న కిషాన్ రథ్ ఆసనం

ఇండియా కూటమివైపు బిజద అడుగులు?

- కాంగ్రెస్, రాహుల్‌ను ప్రస్తుతిస్తున్న పార్టీ నేతలు

ప్రజలు విశ్వసిస్తున్నారు




ఇటీవల రాజ్యసభ బిజద ఎంపీ దేవాశిష్ సామంత్రాయ్ జగత్సింగ్‌పూర్‌లో చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. దేశ, రాష్ట్ర హితం, ప్రయోజనాలు ధ్యేయంగా బిజద కాంగ్రెస్‌తో చేతులు కలపడానికి సిద్ధమన్నారు. వెంటనే ఇది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. ఆదివారం రాత్రి కటక్‌లో సామంత్రాయ్ విలేకర్లతో మాట్లాడుతూ రెండు రాష్ట్రాల ఎన్నికల తరువాత వెలువడిన ఎగ్జిట్‌పోల్స్ కాంగ్రెస్‌కు సానుకూలంగా ఉన్నాయన్నారు. త్వరలో ఝార్ఖండ్, మహారాష్ట్రల్లో జరగనున్న ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పైచేయి సాధిస్తుందని, రాహుల్‌కు దేశవ్యాప్తంగా ఆదరణ కనిపిస్తోందన్నారు.

మారనున్న సమీకరణాలు



బిజద ఉపాధ్యక్షుడు, విపక్ష ఉపనేత ప్రసన్న ఆచార్య ఆదివారం రాత్రి సంబల్‌పూర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ రాహుల్‌కు ప్రజాదరణ పెరిగిందన్నారు. ఇండియా కూటమి బలం పుంజుకుంటోందని, సమీప భవిష్యత్‌లో రాజకీయ సమీకరణాలు మారనున్నాయని పేర్కొన్నారు. బిజద కాంగ్రెస్‌కు దగ్గరవుతోందా? అన్న ప్రశ్నకు సమాధానం దాటవేశారు.



భువనేశ్వర్, న్యూస్‌టుడే: 'ఇండియా' కూటమిలో బిజద చేరనుందా? రాజకీయ సమీకరణాలు మారనున్నాయా? నవీన్ పట్నాయక్ రాహుల్‌గాంధీతో 'చెయ్యి' కలుపుతారా? అన్నదిప్పుడు రాష్ట్రంలో చర్చనీయాంశమైంది. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులుండరని, ఏదైనా జరగొచ్చని పరిశీలకులంటున్నారు.

సమాన దూరం మాట మరిచారు

బిజు పట్నాయక్ భాజపాను ఎప్పుడూ దూరంగానే ఉంచారు. మతతత్వశక్తులకు తాను దూరంగా ఉంటానని, లౌకిక వాదానికి కట్టుబడ్డానని చెప్పుకున్నారు. ఆయన మరణానంతరం రాజకీయాల్లోకి వచ్చిన నవీన్ భాజపాతో జట్టుకట్టారు. కలసి ప్రభుత్వం ఏర్పాటు చేశారు. తరువాత ఆ పార్టీతో సంబంధాలు బెడిసికొట్టాయి. మిత్రుల మధ్య దూరం పెరిగింది. అనంతరం తాము భాజపా, కాంగ్రెస్‌లకు సమాన దూరంలో ఉన్నామని నవీన్ పదేపదే చెప్పారు. మరోవైపు భాజపాతో లోపాయికారీ బంధం కొనసాగించారు. సార్వత్రిక ఎన్నికల ముందు ఈ పార్టీల మధ్య పొత్తు కోసం సుదీర్ఘ చర్చలు జరిగాయి. సమీకరణాలు కుదరక ఒంటరి పోరు చేశాయి. భాజపా అధికారంలోకి వచ్చింది. బిజద ప్రతిపక్షానికే పరిమితమైంది.

ఊపందుకున్న విమర్శలు

పరాజయం ఎరుగని బిజదకు ప్రజలు విపక్ష బాధ్యతలు అప్పగించారు. లోక్‌సభలో బిజద ఖాతా తెరవలేకపోయింది. దీన్ని ఆ పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. భాజపాపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. రాజ్యసభలో 9గా ఉన్న సంఖ్యాబలం 7కి పడిపోయింది. ఇద్దరు బిజద రాజ్యసభ ఎంపీలు భాజపాలో చేరారు. ఈ పరిణామాలు బిజద పెద్దలకు ఆందోళనకు గురి చేశాయి.

ఎగ్జిట్ పోల్స్ తరువాత

బిజద అగ్రనేతలిప్పుడు రాహుల్ గాంధీని ప్రస్తుతిస్తున్నారు. దేశంలో కాంగ్రెస్ మళ్లీ పుంజుకుందంటున్నారు. హరియాణా, జమ్మూకశ్మీర్ ఎన్నికల తర్వాత వెలువడిన ఎగ్జిట్‌పోల్స్ విన్న బిజద నేతలు హర్షం వ్యక్తం చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఇండియా కూటమిలో ఈ ప్రాంతీయ పార్టీ చేరే అవకాశం ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

మరికొన్ని పార్టీలు చేతులు కలుపుతాయి



దీనిపై పీసీసీ మాజీ అధ్యక్షుడు జయదేవ్ జెనా ఆదివారం రాత్రి భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమైందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకున్న ప్రాంతీయ పార్టీలు సమీప భవిష్యత్తులో ఇండియా కూటమిలో చేరడం తథ్యమన్నారు. ఎక్కడ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు.

భాజపాకు ఎలాంటి నష్టం లేదు



భాజపా రాష్ట్రశాఖ ఉపాధ్యక్షుడు గోలక్ మహాపాత్ర్ సోమవారం భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ఇండియా కూటమిని అతుకుల బొంతగా అభివర్ణించారు. హరియాణా ఎన్నికలు ప్రాంతీయ సమస్యల ఆధారంగా జరిగాయన్నారు. రెండు రాష్ట్రాల ఫలితాలు దేశ రాజకీయాలను ప్రభావితం చేయలేవన్నారు. రాష్ట్రంలో బిజద నేతల మధ్య కుమ్ములాటలు కనిపిస్తున్నాయని, ఆదరణ కోల్పోయిన వారు తలో ప్రకటన చేస్తున్నారన్నారు.

వన్యప్రాణి అభయారణ్యంలో 756 గ్రామాలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే

వన్యప్రాణులు సంచరించే ప్రాంతాల నుంచి జనావాసాలను వేరు చేసేందుకు అటవీశాఖ ప్రణాళికలు వేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వన్యప్రాణి అభయారణ్యాల్లో ఇప్పటికీ 756 గ్రామాలు ఉన్నాయి. క్రమేపీ వీటిని ఖాళీ చేయించి ఆయా గ్రామస్థులకు వేరేచోట పునరావసరం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 1994 నుంచి 2023-24 మధ్య సిమిలిపాల్, సత్కోసియా, డెబ్రిగఢ్, హదాగఢ్, ఖాలాసుని పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 1857 కుటుంబాలను ఖాళీ చేయించి వేరేచోట పునరావసం కల్పించినట్లు అటవీశాఖ గణాంకాలు పేర్కొంటున్నాయి. ఈ ఏడాది సతకోసియా పులుల సంరక్షణ కేంద్రం, హదాగఢ్, చందక అభయారణ్యాల పరిధిలో వివిధ గ్రామాల్లో నివసిస్తున్న 1,287 కుటుంబాలకు పునరావాసం కల్పించేందుకు ప్రతిపాదనలు చేసినట్లు అటవీశాఖ వర్గాల సమాచారం.




బితర్‌కనికలో అత్యధిక గ్రామాలు..

రాష్ట్రంలో మొత్తం 19 వన్యప్రాణి అభయారణ్యాలు ఉండగా, వీటిలో 14 అరణ్యాల్లో మాత్రమే మానవ ఆవాసాలు కొనసాగుతున్నాయి. మరో ఐదింటిలో నివాసాలు లేకపోవడం గమనార్హం. 2023-24లో సతకోసియాలోని భుర్కుండి గ్రామం నుంచి 126, తుల్కా నుంచి 270, అసన్‌బహాల్ నుంచి మరో 88 కుటుంబాలను ఖాళీ చేయించి పునరావాసం కల్పించారు.

రూ.20 లక్షల సాయం

గత మూడేళ్ల నుంచి సవరించిన ఆర్థిక సాయం ప్రకారం.. పునరావాస ప్యాకేజీ కింద చెల్లిస్తున్న రూ.15 లక్షలకు అదనంగా మరో రూ.5 లక్షలు ప్రభుత్వం అందజేస్తున్న విషయం విదితమే. ఆ ప్రకారం సిమిలిపాల్, సతకోసియా, హదాగఢ్, డెబ్రిగఢ్ పరిధిలో 963 కుటుంబాలకు లబ్ధి చేకూరినట్లు రికార్డులు పేర్కొంటున్నాయి. కపిలాస్, ఖాలాసుని అభయారణ్యాల పరిధిలో ఒక్కో గ్రామం ఉండగా, నందన్‌కానన్, పూరీ, చిలికా, గహిర్‌మఠ్, డెబ్రిగఢ్ అభయారణ్యాల్లో మానవ ఆవాసాలు లేవని అటవీశాఖ వర్గాలు స్పష్టం చేశాయి. జాతీయ పులుల సంరక్షణ అథారిటీ నుంచి ఆమోదం దక్కించుకున్న డెబ్రిగఢ్‌లో గతేడాది మానవ ఆవాసాలను ఖాళీ చేయించినట్లు ఆ శాఖ వెల్లడించింది.



సతకోసియాలోని ఓ ప్రదేశం

వివిధ అభయారణ్యాల పరిధిలో ప్రస్తుతానికి ఉన్న గ్రామాల వివరాలు

అభయారణ్యం	గ్రామాలు
బితర్‌కనిక	358
సతకోసియా	125
కొటాగఢ్	65
సిమిలిపాల్	56
బైసిపల్లి(నయాగఢ్)	62
సునాబెడ	26
బొద్రమ	27
కార్లాపట్	19

మానవ కళ్యాణమే దసరా పరమార్థం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మానవ కళ్యాణమే దసరా వేడుకల పరమార్థమని, దుష్టశక్తులపై విజయం ఈ పండగ విశిష్టత అని, దేశ సమగ్రత, అఖండత, సమైక్యతకు ఇది నిలువుటద్దమని గవర్నరు రఘుబర్‌దాస్ పేర్కొన్నారు. సోమవారం భువనేశ్వర్‌లోని సత్యనగర్ యువసమాజ్ ఏర్పాటు చేసిన దేవీ పెండాల్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం అమ్మవారికి పూజలు చేశారు.



భువనేశ్వర్ సత్యనగర్‌లో ఏర్పాటైన మహిషాసుర మర్దని పెండాల్



పెండాల్ ప్రారంభిస్తున్న రఘుబర్‌దాస్

రేపు మహిళల ఖాతాల్లోకి సుభద్ర సొమ్ము

భువనేశ్వర్, న్యూస్‌టుడే: 'సుభద్ర' పథకం తొలివాయిదా రెండోవిడత సొమ్ము బుధవారం మహిళల బ్యాంకు ఖాతాల్లో జమవుతుందని ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడ సోమవారం భువనేశ్వర్‌లో విలేకర్లకు చెప్పారు. బుధవారం బరిపదలో ఉత్కళమణి గోపబంధుదాస్ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటయ్యే కార్యక్రమంలో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి ఈ సొమ్ము విడుదల చేస్తారన్నారు.



ప్రభాతి పరిడ

ఉద్యోగోన్నతులకు నియమావళి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రభుత్వం సోమవారం సాయంత్రం ఉన్నతస్థాయి అధికారుల ఉద్యోగోన్నతులకు (ప్రమోషన్లు) సంబంధించి నియమావళి (గైడ్‌లైన్స్) జారీ చేసింది. సాధారణ పాలనా విభాగం అధికార వర్గాలు తెలిపిన వివరాల మేరకు లోక్‌సేవాభవన్‌లో మంత్రుల వద్ద కార్యదర్శులుగా, కార్యాలయాల్లో ప్రత్యేక అధికారులుగా (ఓఎస్‌డీ) విధులు నిర్వహిస్తున్న వారికి అందులో ఉన్న అనుభవం (సీనియారిటీ) తరువాత ఉద్యోగోన్నతులు ఇస్తారు. సర్వీసు కాలంలో కేసులు, వివాదాలు, ఆరోపణలు లేనివారికే ఈ విషయమై ప్రాధాన్యం ఉంటుంది.

వీఆర్‌ఎస్ తీసుకున్న అరుణ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: దక్షత గల పోలీసు అధికారిగా నిరూపించుకున్న అరుణ్‌కుమార్ షడంగి మోహన్‌చరణ్ మాఝి సర్కారు ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఓపీఎస్‌సీ) అధ్యక్షుడిగా నియమించిన సంగతి తెలిసిందే. బాధ్యతలు స్వీకరించనున్న అరుణ్ సోమవారం వీఆర్‌ఎస్ తీసుకున్నారు. ఈ సందర్భంగా భువనేశ్వర్ బిజుపట్నాయక్ పోలీసు అకాడమీ ఆవరణలో వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఇదివరకు ఐజీగా, డీజీపీగా విధులు నిర్వహించిన ఆయన ప్రస్తుతం పోలీసు అకాడమీ సంచాలకుడిగా వ్యవహరిస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 85 వినతులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండిలోని కలెక్టర్ కార్యాలయంలో పాలనాధికారి బిజయ్‌కుమార్ దాస్ అధ్యక్షతన సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. పర్లాఖెముండితోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి 85 వినతులు వచ్చాయి. వీటిలో 8 ఫిర్యాదులను అధికారులు తక్షణమే పరిష్కరించారు. కార్యక్రమంలో పింఛను, ఇళ్ల నిర్మాణం, అటవీ భూమి పట్టాల కోసం ఫిర్యాదులందాయని అధికారులు తెలిపారు. ఎస్పీ జితేంద్రకుమార్ పండా, జిల్లా అటవీశాఖ అధికారి ఎస్. ఆనంద్, గుసానిసమితి అధ్యక్షుడు ఎన్. వీరాజు, అధికారులు పాల్గొన్నారు.

14 నుంచి లక్ష్మీ బస్సు సేవలు

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలో ఈ నెల 14వ తేదీ నుంచి 11 మార్గాల్లో లక్ష్మీ ఏసీ బస్సు సేవలు ప్రారంభం కానున్నాయి. ఏసీ, నాన్ ఏసీ బస్సులు తిరిగే రూట్ మ్యాప్‌లను సిద్ధం చేసినట్లు జయపురం ఆర్టీవో రాజేష్ మారండి తెలిపారు. ఈ బస్సుల నిర్వహణ చార్టెట్ స్పీడ్ లిమిటెడ్ సంస్థకు అప్పగించినట్టు పేర్కొన్నారు.

రైతులకు అండగా భాజపా

జయపురం, న్యూస్‌టుడే: రైతుల అభ్యున్నతి కోసం ప్రధాని నరేంద్రమోదీ అనేక పథకాలు రూపొందించారు. రైతుల ఆదయాన్ని రెట్టింపు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు మహేశ్వర్ సాహు పేర్కొన్నారు. జయపురం పట్టణం అంబాగుడలో సోమవారం భాజపా తరఫున నిర్వహించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముఖ్యమంత్రి చరణ్‌మాఝి 100 రోజుల పాలనలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు క్వింటాల్ రూ.3100లకు విక్రయింపు ధర పెంచారని తెలిపారు. రాష్ట్ర మోర్చా ఉపాధ్యక్షుడు బిపద్‌భంజన్‌దాస్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించగా కొరాపుట్ శాసనసభ్యుడు రఘురాం మచ్చా, జిల్లా ఉపాధ్యక్షుడు పులిన్ ప్రకాష్, జిల్లా అధ్యక్షుడు భగవాన్ ముదులి, జయపురం నియోజకవర్గ అధ్యక్షుడు గౌతమ్ సామంత్రాయ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో 58 శీతల గిడ్డంగిలు నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నారు. 6 లక్షల మంది రైతులకు ప్రధానమంత్రి కిసాన్ యోజనలో చేర్చామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వర్ సాహు

సభాపతికి రాక

శాసన సభాపతి సురమా పాడి సోమవారం బ్రహ్మపుర వచ్చారు. మధ్యాహ్నం గిరిరోడ్డులోని పాడి సెలబ్రేషన్స్ ఆవరణలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం



రాజ్‌భవన్ ముట్టడికి యత్నం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: యువ, ఛాత్ర కాంగ్రెస్ నాయకులు సోమవారం భువనేశ్వర్ రాజ్‌భవన్ ముట్టడి యత్నం చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కొంతమంది రాజ్‌భవన్ వైపు టమాటాలు రువ్వారు. ఛాత్ర కాంగ్రెస్ అధ్యక్షుడు యాసిర్ నవాజ్ విలేకర్లతో మాట్లాడుతూ గవర్నరు కుమారుడు పూరీ రథయాత్రలో సెక్యూరిటీ అధికారిపై చేయి చేసుకున్న ఘటనలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోనందుకు నిరసనగా రాజ్‌భవన్ ముట్టడి ప్రయత్నం చేసినట్లు చెప్పారు.



వేదికపై పాలనాధికారి బిజయ్‌కుమార్‌దాస్, జడ్పీ అధ్యక్షుడు తిరుపతిరావు తదిదరులు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం పర్లాఖెముండిలోని గజపతి క్రీడా ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. పాలనాధికారి బిజయ్‌కుమార్‌దాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జడ్పీ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, జడ్పీ కార్యనిర్వహణ అధికారి గుణనిధి నాయక్, పురాధ్యక్షురాలు నిర్మల సెఠి తదితరులు పాల్గొన్నారు. పాలనాధికారి దాస్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఒత్తిడిని జయించవచ్చని, ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. జిల్లాస్థాయి క్రీడల్లో ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు చేరుకున్నారని, ఇక్కడ కూడా రాణించి జాతీయస్థాయికి చేరుకోవాలని విద్యార్థులను ఆకాంక్షించారు. అండర్-14, 17 విభాగాల పోటీల కోసం రాష్ట్రంలోని 30 జిల్లాలతో పాటు భువనేశ్వర్‌కు చెందిన సుమారు 814 మంది విద్యార్థులు పాల్గొన్నారని జిల్లా క్రీడాధికారి ప్రాణకృష్ణ పాణిగ్రహి తెలిపారు. జిల్లా విద్యాధికారి మాయదర్ సాహు, లోకసభ ప్రతినిధి దారపు రాజేష్ పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం



ఖరగ్‌పూర్‌కు చెందిన ఉపద్రవ సంస్థ మహిళలు వరద బాధితుల సహాయార్థం సోమవారం ఆహార పదార్థాలు, దుస్తులను పంపిణీ చేసింది. సంస్థకు చెందిన సురేంద్రకుమార్, రాజేష్‌శర్మ తదితరులు వరద బాధిత ప్రాంతాలైన పన్నా, దిండీపూర్, బదాదా మారుమూల గ్రామాలకు వెళ్లి అక్కడి ప్రజలకు ఆహార పదార్థాలు, తాగునీటి సీసాలు, దుస్తులు అందజేశారు. – న్యూస్‌టుడే, ఖరగ్‌పూర్

పాఠశాలకు పంకాల వితరణ

పట్టణ మలంచా పంజాబ్ నేషనల్ బ్యాంకుశాఖ తమ పాఠశాలకు 10 సీలింగ్ ఫ్యాన్లు బహూకరించిందని ఆంధ్రా ఉన్నత మాధ్యమిక పాఠశాల ఉపాధ్యాయుడు, ఇన్‌ఛార్జి డా. కల్లి తారకేశ్వరరావు సోమవారం తెలిపారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారన్నారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు అజిత్ సుతార్, సుజిత్ కుమార్ సెగి, పవన్‌కుమార్ బచ్చన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, ఖరగ్‌పూర్



820 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరి అరెస్టు

మోహన, సిమిలిగుడ న్యూస్‌టుడే: భారీగా గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితులను పాడువా పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారంతో ఆదివారం రాత్రి పండిపుట్టు కూడలి వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వారిని చూసిన నిందితులు బొలెరో వాహనాన్ని విడిచిపెట్టి పారిపోతుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. నిందితులు జోలాపుట్ నుంచి గంజాయిని తీసుకువస్తున్నారు. మొత్తం 826 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పరారైన మరో నిందితుడి కోసం గాలింపు చేపడుతున్నట్లు ఐఐసీ అశోక్‌కుమార్ బిసాయి తెలిపారు. సోమవారం ఉదయం ఠాణాలో మేజిస్ట్రేట్ హోదాలో సమితి అభివృద్ధి అధికారి దుర్గాప్రసాద్ దొర సమక్షంలో గంజాయిని తూనిక చేయగా 820 కిలోల 800 గ్రాములు ఉన్నట్లు గుర్తించారు. దీంతో గంజాయి అక్రమ రవాణా నేరంపై గంజాం జిల్లా పురుషోత్తంపూర్ ఠాణా ప్రతాప్‌పూర్‌కు చెందిన సుదర్శన్ దాస్, ఆంటీబర్‌కు చెందిన విక్రమ్ కీర్షన్‌ను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. గంజాయి ఖమరా ప్రాంతం నుంచి గంజాం జిల్లాకు రవాణా జరుగుతున్నట్లు పోలీసు దర్యాప్తులో తేలింది.



తనిఖీల్లో పట్టుకున్న వాహనంతో పోలీసులు

ఒకటి నుంచి ఎకోరిట్రీట్ ప్రారంభం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: వచ్చే నెల ఒకటో తేదీ నుంచి కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమితి పుట్‌సీల్‌లో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఎకోరిట్రీట్ కేంద్రం ప్రారంభమవుతుందని జిల్లా పాలనాధికారి వి.కీర్తివాసన్ తెలిపారు. 2021-22 నుంచి ఇక్కడ ఎకోరిట్రీట్ కేంద్రం ఏర్పాటు చేస్తుండగా, మంచి ఫలితాలు రావడంతో పర్యటకుల కోసం ఈ శీతాకాలంలో దీన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి దృశ్య మాధ్యమం ద్వారా ఈ ఎకోరిట్రీట్ కేంద్రాన్ని ప్రారంభిస్తారని కలెక్టర్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో జిల్లా పాలనాధికారి కీర్తి, జిల్లా ఉన్నతాధికారుల బృందం సోమవారం పుట్‌సీల్‌ను సందర్శించారు. పర్వతంపై కేంద్రం ఏర్పాటుకు అనుకూల స్థలం ఎంపిక చేశారు. పర్యాటకులకు ఎలాంటి సదుపాయాలు కల్పించాలన్న అంశాలపై చర్చించారు. ఏడీఎం లగ్నజిత్ రౌత్, సీడీవో దేవాసిస్‌పట్నాయక్, జిల్లా అటవీశాఖ అధికారి కె.వి.భాస్కరరావు, ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ తపన్‌కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పర్వతంపై అధికారులతో చర్చిస్తున్న జిల్లా పాలనాధికారి కీర్తి

ప్రభుత్వంపై బిజద నేతల గర్జన

జయపురం, న్యూస్‌టుడే: ప్రజలను నమ్మించి భాజపా ప్రభుత్వం మోసం చేసిందని మాజీ మంత్రి రబినారాయణ నందో, జిల్లా బిజద అధ్యక్షుడు, మాజీ ఎంపీ జిహ్నాహికాక మండిపడ్డారు. జయపురంలో సోమవారం జరిగిన బిజద జన సంపర్కయాత్రలో ఆ పార్టీ నాయకులు గర్జించారు. ఘాట్‌బాగ్ నుంచి మాలిదొలాయిపుట్ వరకు ర్యాలీ నిర్వహించారు. సుభద్ర యోజన కింద మహిళలకు రూ.50 వేలు ఇస్తామని ప్రకటించినా అవి కొంతమందికే అందాయని, నిరుపేదలకు నెలకు 300 యూనిట్లు ఉచిత విద్యుత్తు, వృద్ధులకు రూ.3 వేల పింఛను అందజేస్తామని నమ్మబలికి ఓట్లు సాధించారని విమర్శించారు.



ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి తదితరులు

పంచాయతీ కార్యాలయం ముట్టడి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నందపూర్ సమితి పాడువాలోని మీద వీధిలో మంచినీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. వీధిలో ఉండే నీటివనరులు, గొట్టపుబావులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రజలు అర కిలోమీటరు దూరంలో ఉన్న ఊట నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. స్థానిక మహిళలు సోమవారం పాడువా పంచాయతీ కేంద్రాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. ఏళ్లుగా మంచినీటి సమస్య వెంటాడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని, అక్కడ ఉన్న అధికారులను ప్రజాప్రతినిధులను నిలదీశారు. సర్పంచి గోపీనాథ్ సీసా, సమితి సభ్యులు నీలకంఠ మజ్జి, పంచాయతీ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై సమితి అభివృద్ధి అధికారి దృష్టికి తీసుకువెళ్లి నీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



అధికారులను నిలదీస్తున్న మహిళలు

సహాయక బృందాలకు ఆర్థిక సాయం



మహిళకు చెక్కు అందిస్తున్న పాలనాధికారి పరుల్ పట్వారి, ఎస్పీ స్వాతి

రాయగడ, న్యూస్‌టుడే: పండ్లు, కూరగాయలు పండించేందుకు ముందుకు వచ్చిన స్వయం సహాయక బృంద మహిళలకు పాలనాధికారి పరుల్ పట్వారి ఆర్థిక సహకారం అందించారు. జిల్లా పరిషత్తు సమావేశ భవనంలో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కరించారు. కుటుంబ ఆస్తి తగాదాలు వంటి వాటిని సంబంధిత శాఖ అధికారులకు బదిలీ చేశారు. రెండు స్వయం సహాయక బృంద మహిళలకు ఒక్కొక్క గ్రూపునకు రూ.6 లక్షల చొప్పున చెక్కులు, దివ్యాంగులకు మూడు చక్రాల కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ స్వాతి, జిల్లా పరిషత్తు ముఖ్య కార్యనిర్వహణ అధికారి నిహార్‌రంజన్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో మహిళలకు స్ఫూర్తి



కొరాపుట్, న్యూస్‌టుడే: అనుకొని సంఘటనలు ఎదురైనపుడు వాటిని ఎదుర్కొని ముందుకు వెళ్తేనే విజయం సాధించగలమని నిరూపించింది ఓ మహిళ. కొరాపుట్ సమితి చింద్రీ గ్రామానికి చెందిన సన్మతి ఆర్థిక కష్టాలతో కుటుంబ పోషణ భారంగా మారిన సరే తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుని ఎందరో గిరిజన మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ఆమె ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మూగజీవాల పెంపకంలో శిక్షణ పొందింది. మేకల పెంపకాన్ని జీవనాధారంగా చేసుకొని ముందుకు సాగింది. నాలుగు మేకలతో ప్రారంభించిన సన్మతి కేవలం మూడేళ్లలోనే అంచెలంచెలుగా ఎదిగి వాటి అమ్మకాలు జరుపుతోంది. ప్రస్తుతం 70 మేకలను పెంచుతూ.. కుటుంబ పోషణతోపాటు మరో 10 మంది మహిళలకు శిక్షణ ఇస్తూ స్వయం ఉపాధి దిశగా వారిని ప్రోత్సహిస్తోంది.

అప్రకటిత విద్యుత్తు కోతతో అవస్థలు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ సమితిలో పిపిలగూడ, జిమిడిపేట విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలోని తొమ్మిది పంచాయతీల్లో వారం రోజులుగా అప్రకిటిత విద్యుత్తు కోతతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఉపకేంద్రం పరిధిలోని గల కెరడ, శేసికల, ఇరుకుబడి, గజ్జిగాం, జిమిడిపేట, భైరాగిహలువ, పెనికోన, దుర్గపాడుతోపాటు దాదాపు 120 గ్రామాల్లో ప్రజలు విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో అవస్థలు పడాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. ముఖ్యంగా మంచినీరు కుళాయిలకు సంబంధించి మోటార్లు పనిచేయక నీటి కోసం ఇక్కట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబధిత టాటపవర్ ఇంజనీరు బాసుదేవ దృష్టికి తీసుకురాగా రాయగడ ప్రధాన విద్యుత్తు కేంద్రం(గ్రిడ్) నుంచి గ్రామీణ ప్రాంతాలకు సరఫరా అవుతుంది. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి కరెంటు తీగలు తెగిపోవడంతో విద్యుత్తు సరఫరాకి అంతరాయం ఏర్పడుతుందని, పూర్తిస్థాయి పనులు చేయిస్తున్నామని తెలిపారు.



మాట్లాడుతున్న జడ్పీ సస్మిత

అభివృద్ధి పేరుతో పర్యావరణానికి తూట్లు

కొరాపుట్, న్యూస్‌టుడే: దండకారాణ్యాలకు పుట్టినిల్లు, దట్టమైన అడవులు, మనోహరమైన పర్యావరణ జిల్లా కొరాపుట్‌ను మరో కాశ్మీర్‌గా వర్ణిస్తారు. అటువంటి సుందరమైన ప్రాంతంలో అభివృద్ధి పేరుతో అడవులను ఇష్టానుసారంగా నరికి వేస్తూ పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో స్థానిక గిరిజన సంగ్రహాలయంలో ఓ ఒడియా దినపత్రిక ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో వాతావరణ మార్పులపై చర్చావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే రఘురామ్ మాచో, జడ్పీ సస్మిత మెలక, పురపాలక లలిత్‌రంజన్ సెఠి, ఛైర్మన్లు పాల్గొని మాట్లాడారు.

ప్రకృతి ప్రేమికులకు అవార్డులు అందజేత

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర అటవీ డివిజన్ ఆధ్వర్యంలో '70వ వన్యప్రాణి వారోత్సవాల' గంజాం జిల్లా స్థాయి వేడుకలు సోమవారం బ్రహ్మపురలో జరిగాయి. రీజనల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (ఆర్‌సీసీఎఫ్) కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన దీనికి బ్రహ్మపుర అటవీ అధికారి (డీఎఫ్‌ఓ) సన్నీ ఖొఖర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఆర్‌సీసీఎఫ్ సంజయ కుమార్ స్వయిన్ పాల్గొన్నారు. ఎకో క్లబ్ గంజాం జిల్లా సమన్వయకర్త డాక్టర్ శంకర నారాయణ బెజ్ సమన్వయకర్తగా వ్యవహరించిన కార్యక్రమంలో ఉత్తర ఘుముసుర డీఎఫ్‌ఓ హిమాంశు శేఖర్ మహంతి, దక్షిణ ఘుముసుర డీఎఫ్‌ఓ బినోద్ ఆచార్య, మాజీ గౌరవ వన్యప్రాణి వార్డెన్ రబీంద్రనాథ్ సాహు, డీసీఎఫ్ దిలీప్ బారిక్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మపుర, ఛత్రపురం, భంజనగర్ సబ్ డివిజన్ల పరిధుల్లో ముగ్గురికి బిజు పట్నాయక్ వన్యప్రాణి సంరక్షణ అవార్డులు, నగదు బహుమతులు అందజేశారు. అలాగే 18 సంస్థల ప్రతినిధులకు ప్రకృతి మిత్ర, 17 మందికి ప్రకృతి బంధు అవార్డులు, నగదు బహుమతులను అతిథులు అందజేశారు.



బ్రహ్మపుర సబుజ వాహిని కార్యదర్శి ఎ.ప్రకాష్‌కు 'ప్రకృతి బంధు' అవార్డు అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

ఘనంగా రఘునాథ్ విగ్రహ ప్రతిష్ఠ

జయపురం, న్యూస్‌టుడే: విద్య, ఆర్థిక వ్యవహారాల మాజీ మంత్రి రఘునాథ్ పట్నాయక్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం జయపురంలో జరిగింది. ప్రజల కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్, భాజపా నేతలు కొనియాడారు. నేటితరం రాజకీయ నేతలకు ఆయన ఆదర్శనీయమన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విద్యాశాఖ మంత్రి నిత్యానంద్‌గండ్, కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక, జయపురం, నవరంగపూర్ ఎమ్మెల్యేలు తారాప్రసాద్ వాహినిపతి, గౌరీశంకర్ మాఝి, స్థానిక పురాధ్యక్షుడు నరేంద్రమహంతి పాల్గొన్నారు.



విగ్రహం వద్ద కాంగ్రెస్, భాజపా నేతలు

పతకాలతో మెరిసిన రోహిత్

కొరాపుట్‌కి చెందిన రోహిత్ పాత్ర్ దక్షిణాఫ్రికా సన్ సిటీలో జరుగుతున్న క్లాసిక్ కామన్‌వెల్త్ క్రీడలలో బంగారు, రజత పతకాలతో మెరిశాడు. పవర్ లిఫ్టింగ్‌లో దిగ్గజాలను ఓడించి బంగారు పతకం సాధించగా, బెంచ్ ప్రెస్ పట్టీ రజత పతకం సాధించాడు. రోహిత్‌పాత్ర్ సాధించిన విజయం కొరాపుట్‌తో పాటు దేశానికి ఒక యువ క్రీడాకారుడ్ని పరిచయం చేసిందని కేంద్రీయ విశ్వవిద్యాలయ ఉప కులపతి చక్రధర త్రిపాఠి అభినందించారు. – న్యూస్‌టుడే, కొరాపుట్



కాంగ్రెస్ నేతల నిరాహార దీక్ష

నవరంగపూర్, న్యూస్‌టుడే: రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నవరంగపూర్ జిల్లాలో కాంగ్రెస్ నేతలు నిరాహార దీక్ష చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత మున్నా త్రిపాఠి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని విద్యావంతులైన నిరుద్యోగ యువతను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రానున్న రోజుల్లో జిల్లా ఉద్యోగ నియామకాల ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామన్నారు.

బస్సు సేవలు..

జయపురం: నిలిచిపోయిన బ్రహ్మపుర-జయపురం బస్సు సేవలు తిరిగి ప్రారంభించాలని కోరుతూ జయపురం ప్రయాణికులు రాష్ట్ర రవాణా సంస్థ డీటీఎం శ్రీనివాస్ ప్రాణిగ్రహికి సోమవారం వినతి పత్రం అందజేశారు.

తనిఖీలు..

పర్లాఖెముండి: ఆహార భద్రత, పౌరసరఫరాల శాఖ, తూనికల విభాగం సంయుక్తంగా పట్టణంలోని పలు భోజనశాలలు, ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలను తనిఖీ చేశారు.

విజిలెన్స్ దాడులు..

భువనేశ్వర్: బొలంగీర్ తేల్ నది ప్రాజెక్టు ముఖ్య ఇంజినీరు(ఈఈ) జితేంద్ర పాఢి సోమవారం విజిలెన్స్ అధికారుల వలలో పడ్డారు. ఒక బిల్లు చెల్లింపునకు సంబంధించి గుత్తేదారు నుంచి రూ.46 వేలు లంచం పుచ్చుకుంటున్న సమయంలో అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

నరమేధానికి ఏడాది..

బ్రహ్మపుర నగరం: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడి చేసి నరమేధానికి పాల్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా సీపీఎం, సీపీఐ, ఫార్వర్డ్ బ్లాక్‌ల ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శన జరిగింది.

మొసలితో భయం..

గోపాలపూర్: దయ నదిలో మొసలి సంచరిస్తుండడంతో పూరీ జిల్లా పిపిలి సమితిలోని కంతి గ్రామస్థులకు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నదిలో గ్రామస్థులు స్నానాలు చేస్తారు. ఇందులో మొసలి ఉన్న విషయం వారు అటవీశాఖ అధికారులకు తెలియజేశారు.

ఆందోళనలు..

భువనేశ్వర్: రెవెన్యూశాఖలో ఆర్.ఐ., ఏఆర్ఐ, అమీన్ ఉద్యోగాల భర్తీకి ఇటీవల జిల్లాల వారీగా జరిగిన ఆన్‌లైన్ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, ఆఫ్‌లైన్‌లో మళ్లీ నిర్వహించాలని సోమవారం భువనేశ్వర్‌లోని డీఎంజీ కూడలి వద్ద పలువురు నిరుద్యోగులు ఆందోళన నిర్వహించారు.

పోలీసుల దాడి..

బ్రహ్మపుర నగరం: అస్కా ఠాణా పరిధిలో ఒడిశా శివకాశీగా ఖ్యాతిగాంచిన నళబంటలోని బాణసంచా అక్రమ తయారీ కేంద్రాలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. సుమారు రూ.10 లక్షల విలువ గల బాణసంచా, తయారీ సామగ్రి తదితరాలు స్వాధీనం చేసుకున్నారు.

యువకుడి పీక కోసి హత్య

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా హింజిలి ఠాణా పరిధిలోని బడఖండి గ్రామంలో ఆదివారం రాత్రి కొందరు దుండగులు రాజు రెడ్డి అనే యువకుడిపై దాడి చేసి పీక కోసి హతమార్చారు. బ్రహ్మపుర సదర్ ఠాణా పరిధిలో కుకుడాఖండి సమితిలోని సతొపాహండియా గ్రామానికి చెందిన రాజు ద్విచక్ర వాహనంపై బడఖండి వెళ్లి సొంతూరు తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని, ఒకర్ని అనుమానంతో అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

బైకును ఢీకొన్న కంటైనర్: ముగ్గురి మృతి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంఝర్ జిల్లా ఘటగాం ఠాణా పరిధిలోని డెంకికోటా రహదారి కూడలి వద్ద సోమవారం రాత్రి బైకును ఒక కంటైనర్ ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బైకులో ప్రయాణిస్తున్న బలభద్ర ఖటువ్ (48), కన్నూనాయక్ (39), మహేశ్వర్‌నాయక్ (46)లు మృతిచెందారు. వీరు ఘటగాం చేరువలోని మొసనాఖలో గ్రామవాసులుగా పోలీసులు తెలిపారు.

సురంగి గ్రామంలో కలకలం : ఇద్దరు మృత్యువాత

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా పాత్రపురం సమితిలో సురంగి గ్రామంలోని ముకుంద దేవ్ సాగరం (నీటి వనరు)లో సోమవారం ఇద్దరు వ్యక్తులు తేలియాడుతుండడం కలకలం రేపింది. వారు జరడా ఠాణా పరిధిలో సురంగి గ్రామంలోని దళితవాడకు చెందిన ఇంద్రమణి సెఠి (47), అలేఖ్ బెహరా(19)లుగా గుర్తించారు. సాగరం ఒడ్డు సమీపాన ఇద్దరు తేలుతుండడాన్ని గమనించిన గ్రామస్థులు వారిని కాపాడి సురంగిలోని ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. అక్కడ అలేఖ్ మృతి చెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. ఇంద్రమణిని పాత్రపురం ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు.

చెరువులో పడి వృద్ధురాలు ...

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ సమితిలో చెరువులో పడి వృద్ధురాలు మృతిచెందిన ఘటన సోమవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉమ్మర్‌కోట్ ఠాణా పరిధిలో తోహర పంచాయతీ అంబాగుడకు చెందిన చంప లహారా(60) స్నానం చేసేందుకు గ్రామ శివారులో ఉన్న చెరువులో దిగే సమయంలో కాలు జారి అందులో పడిపోయారు. స్థానికులు ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

నవరంగపూర్, బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ సమితిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..జోరిగావ్ సమితి బెలావ్ పంచాయతీ కరమారి గ్రామానికి చెందిన త్రినాథ్‌కలార్(28), ఉమ్మర్‌కోట్ సమితి జాముురుడా పంచాయతీ మెండ్రిగూడకు చెందిన సమరు బొత్రా సోమవారం ఛత్తీస్‌గఢ్ నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. కండగావ్ రహదారి యువి14పై జామురండి పాఠశాల సమీపంలో ఎదురుగా వస్తున్న చమురు వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ఘటనలో గాయపడిన ఇరువురిని స్థానికులు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ త్రినాథ్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ●బ్రహ్మపుర శివారున లంజిపల్లి బైపాస్ సమీపాన 16వ నెంబరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ఓ లారీ ద్విచక్ర వాహన చోదకుడ్ని ఢీకొంది. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం ఎమ్కేసీజీ ఆసుపత్రిలో చేర్పించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు లంజిపల్లి కేశవనగర్ మూడో లైనుకు చెందిన కె.సిద్ధార్థరావుగా తెలిసింది.

విద్యుదాఘాతంతో గోవు..

పర్లాఖెముండి: పర్లాఖెముండి పట్టణం మంగళ వీధిలో విద్యుదాఘాతంతో గోవు మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. మంగళ వీధిలోని ఆరోగ్య కేంద్రం సమీపంలో ఉన్న నియంత్రిక వద్ద పచ్చగడ్డి మేతకు వెళ్లిన గోవు ఒక్కసారిగా కిందపడి మృతి చెందింది.

దుర్గాదేవి నమోస్తుతే

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వాగత్ రహదారి రామలింగేశ్వర ఆలయ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన దుర్గా అమ్మవారికి సోమవారం భాస్కారాచార్యులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పర్లాఖెముండి పట్టణంలోని దండుమాలవీధి వద్ద ఉన్న దండుమారెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మందిర ప్రాంగణంలో అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.
– న్యూస్‌టుడే, రాయగడ, పర్లాఖెముండి



రాయగడ రామలింగేశ్వర కల్యాణ మండపంలో దుర్గమ్మ

వెయిట్ లిఫ్టింగ్‌లో హర్షవర్ధన్, జ్యోత్స్నలకు పతకాలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో కొనసాగుతున్న జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సోమవారం రాష్ట్ర క్రీడాకారులు హర్షవర్ధన్ సాహు, జ్యోత్స్న సబర్ చెరో పసిడి పతకం దక్కించుకున్నారు. ఒడిశా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి కె.రవికుమార్ సాయంత్రం 'న్యూస్‌టుడే'కు ఆ వివరాలు వెల్లడించారు. పోటీల్లో 49 కిలోల శరీరబరువు విభాగంలో హర్షవర్ధన్ స్నాచ్‌లో 85 కిలోలు, క్లీన్ జర్క్‌లో 110 కిలోలు బరువులెత్తి మొదటిస్థానంలో నిలిచాడు. 40 కిలోల శరీరబరువు విభాగంలో మహిళా లిఫ్టరు జ్యోత్స్న సబర్ స్నాచ్‌లో 56 కిలోలు, క్లీన్‌జర్క్‌లో 64 కిలోలు బరువులెత్తి బంగారు పతకం చేజిక్కించుకుంది.





పసిడి పతకాలతో హర్షవర్ధన్ సాహు, జ్యోత్స్న సబర్

భువనేశ్వర్‌లో తూర్పుజోన్ అథ్లెటిక్స్ పోటీలు



డిస్కస్ విసురుతున్న క్రీడాకారిణి

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లో కళింగ మైదానంలో సోమవారం ప్రారంభమైన 35వ తూర్పుజోన్ జూనియర్ అథ్లెటిక్ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన జూనియర్ క్రీడాకారులు 100, 200, 400, 800, 1500 మీటర్ల పరుగు, రిలేరేస్, లాంగ్, హైజంప్‌లు, డిస్కస్, జావెలిన్, షాట్‌పుట్, హర్డిల్స్, హేమర్ త్రో తదితరాంశాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.



లాంగ్‌జంప్ చేస్తున్న క్రీడాకారుడు

రాష్ట్రస్థాయి నాన్‌చాక్ శిక్షణ సదస్సు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఒడిశా నన్‌చాకు సంఘం తరపున రాష్ట్రస్థాయి నాన్‌చాక్ శిక్షణ శిబిరం జరిగింది. భువనేశ్వర్‌లోని ఉత్కళ కరాటే స్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఇందులో వివిధ జిల్లాల నుంచి జూనియర్, సీనియర్ విభాగాలకు చెందిన మొత్తం 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరికి శిక్షకులు సపన్‌కుమార్ మిశ్ర, దీపక్‌కుమార్ సామంత్రాయ్‌లు వివిధ అంశాల్లో తర్ఫీదునందించారు.



హర్డిల్స్ దూకుతున్న క్రీడాకారిణులు

అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో అవినాష్, ఆయుష్‌లకు ద్వితీయస్థానం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఉగండాలోని కంపాలలో ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు జరిగిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు అవినాష్ మహంతి, ఆయుష్ పట్నాయక్‌లు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ మేరకు రాష్ట్ర క్రీడా విభాగం సోమవారం 'ఎక్స్'లో ఆ వివరాలు వెల్లడించింది. పోటీల్లో డబుల్స్ తుదిపోరు మ్యాచులో వీరిద్దరు నితిన్ హెచ్‌వీ, వెంకటహర్షవర్ధన్‌ల జోడితో ఆడి ఓటమిపాలై ద్వితీయస్థానంలో నిలిచి పతకం దక్కించుకున్నారు.



పతకాలతో అవినాష్ మహంతి, ఆయుష్ పట్నాయక్

7,700 కిలోల బియ్యం స్వాధీనం

సీతానగరం, న్యూస్‌టుడే: ప్రజా పంపిణీ వ్యవస్థలో సరఫరా చేసిన బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న మూడు వాహనాలను సీజ్ చేసినట్లు విజిలెన్సు, ఎన్‌ఫోర్సుమెంటు అధికారి బి.సింహాచలం తెలిపారు. సోమవారం మండలంలోని కాశాపేట, చినభోగిల, అప్పయ్యపేటలో తనిఖీలు చేస్తుండగా మూడు వాహనాల్లో తరలిస్తున్న 7,700 కిలోల బియ్యం పట్టుబడినట్లు చెప్పారు. సరకుతో పాటు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బొబ్బిలి మండలం పిరిడి, కమ్మవలసకు చెందిన పలువురు స్థానికంగా కొనుగోలు చేసి ఒడిశాలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. సీఎస్‌డీటీ రమేష్‌బాబు, వీఆర్వోలు కుమారస్వామి, నాగమణి, సింహాచలం ఉన్నారు.

రైల్వే లైన్ కోసం లక్ష సంతకాలు

పాలకొండ, న్యూస్‌టుడే: విజయనగరం నుంచి పాలకొండ మీదుగా రైల్వే లైను ఏర్పాటు చేయాలని కోరుతూ లక్ష సంతకాల సేకరణను సోమవారం ప్రారంభించారు. భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టంకాల దుర్గారావు ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్సు, ప్రధాన కూడళ్లలో సంతకాలు సేకరించారు. జిల్లా ప్రజల ఆకాంక్షను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు.



వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమైన ఈ రోజుల్లో సమాజానికి సాయం చేయాలనే గుణం అడుగంటి పోయింది. కానీ అలాంటి వ్యక్తులు తారసపడితే వారి గురించి చెప్పుకోవాల్సిందే.. సోంపేటకు చెందిన పెడిశెట్టి భైరిస్వామి అదే కోవలోకి వస్తారు. చిన్న దుకాణంతో జీవనోపాధి పొందుతున్న ఆయన తన డబ్బుతో కలిపి రూ.రెండు కోట్ల నిధులు సమకూర్చి సత్యదేవుడి ఆలయాన్ని నిర్మించారు. ఈ క్రమంలో అన్ని అవాంతరాలను అధిగమించారు.



సోంపేట సత్యదేవుని ఆలయం

సామాన్యుడి సంకల్పం.. ఆధ్యాత్మిక సౌరభం

- సోంపేటలో సత్యదేవుడికి ఆలయం
- రూ.2కోట్లకు పైగా నిధులు సమకూర్చిన భక్తుడు భైరిస్వామి

న్యూస్‌టుడే, సోంపేట

భైరిస్వామిది చిన్ననాటి నుంచి కష్టపడే తత్వం. పిల్లలు లేకపోవడంతో ఒక అమ్మాయిని దత్తత తీసుకొని అన్ని బాగోగులు చూసి వివాహం చేసి పంపించేశారు. యువకుడిగా ఉన్న సమయం నుంచి సమాజానికి మేలు చేయాలనే భావనలో ఉన్న ఆయన అప్పటి నుంచి డబ్బు కూడబెట్టారు. సత్యదేవుడి ఆలయం లేదని గుర్తించి నిర్మించాలనుకున్నారు. భార్య జ్యోతికుమారి సహకరించడంతో దాచుకున్న మొత్తంతోపాటు కొంత అప్పు చేయగా, విషయం తెలుసుకున్న దాతలు ముందుకు రావడంతో రూ.2 కోట్లు సమకూరాయి. సోంపేటలో ఆలయం నిర్మాణానికి పూనుకొన్నారు.




మూలవిరాట్ సత్యనారాయణ స్వామి

తంజావూరులో స్వామి విగ్రహం తయారీ

స్థానిక సోమపోలమాంబ ఆలయం ముందున్న స్థలాన్ని కొనుగోలు చేసి నిర్మాణాన్ని ప్రారంభించారు. స్థలం కోసమే రూ.కోటి వరకు వెచ్చించగా, నిర్మాణానికి మరో రూ.కోటిపైగా అయింది. తంజావూరులో స్వామి విగ్రహాన్ని తయారు చేయించారు. మఖరతోరణం, వెండికవచం, ఉత్సవ విగ్రహాలు, ధ్వజస్తంభం, గాలిగోపురానికి దాతలు సహకరించారు. భైరిస్వామి ఛైర్మన్‌గా ట్రస్టు ఏర్పాటు చేసి నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు.

చిరకాలం నిలిచిపోతాం.. కష్టపడి సంపాదించిన మొత్తం సమాజానికి ఉపయోగపడాలనే ఆలోచనతోనే సత్యదేవుని ఆలయ నిర్మాణానికి సంకల్పించాను. కొందరు ఆధ్యాత్మికవేత్తలు, దాతలు ఇందుకు సహకరించారు. ఇలాంటి పనుల వల్ల ప్రజల్లో చిరకాలం నిలిచిపోతాం.
– పైడిశెట్టి భైరిస్వామి, జ్యోతికుమారి దంపతులు





చిక్కరు.. దొరకరు..!

చదువుకోవాల్సిన వయసులో మత్తుకు బానిసలై కొందరు.. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆశతో ఇంకొందరు యథేచ్ఛగా గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారు. యువతను నిషా లోకంలో ముంచి జేబులు నింపుకొంటున్నారు. పోలీసుల కళ్లు గప్పి తిరగదంలోనూ వీరు ఆరితేరిపోయారు. జిల్లావ్యాప్తంగా నాలుగేళ్లలో నమోదైన కేసుల్లో ఇప్పటికీ 56 మంది నిందితులు ఎక్కడున్నారో తెలియట్లేదు. ఎంత జల్లెడ పడుతున్నా ఆచూకీ అంతు చిక్కట్లేదు.

అసలు దొంగలు ఎక్కడ?


ఈ దందాలో విక్రేతలకు, కొనుగోలుదారుడిని ప్రత్యక్ష సంబంధం ఉండదు. రైళ్లలో ఫలానా సీటు కింద బ్యాగు ఉందని ఫోన్‌లో చెప్పి కొందరు వ్యాపారం చేస్తున్నారు. మరి కొన్ని సందర్భాల్లో మూడో వ్యక్తుల ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నారు. పోలీసులకు పట్టుబడుతున్నవారిలో ఇలాంటి వారే ఎక్కువగా ఉంటున్నారు. అసలు దొంగలు దొరకట్లేదు.



గత నెల 26న ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి గుణుపురం-విశాఖ రైలులో ఓ సూట్‌కేసును సీటు కింద ఉంచి పాతపట్నంలో దిగిపోయారు. ప్రయాణికులకు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు తెరిచి చూస్తే అందులో 13.5 కిలోల గంజాయి దొరికింది. తెచ్చిందెవరో.. ఎక్కడి తీసువెళ్తున్నారనే వివరాలు మాత్రం తెలియలేదు.

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తావిభాగం

జిల్లాలో ఇచ్ఛాపురం, పలాస, ఆమదాలవలస రైల్వే స్టేషన్లలో ఎక్కువ మంది గంజాయితో పట్టుబడుతున్నారు. ఒడిశా నుంచి ఎక్కువగా ప్రయాణికుల వేషధారణల్లో సరకును అక్రమ మార్గాల్లో గమ్యస్థానాలకు చేరవేస్తూ కొందరు దొరుకుతున్నారు. పర్లాఖెముండి, బరంపురం వంటి ప్రాంతాల నుంచి తీసుకువచ్చి ఇక్కడ విక్రయాలు జరుపుతున్నారు. జిల్లాలో 2021 నుంచి ఈ ఏడాది ఇప్పటి వరకు 77 కేసులు నమోదు కాగా.. వాటిల్లో గంజాయి క్రయ, విక్రయదారులు జరుపుతున్న 290 మందిని పోలీసులు పట్టుకున్నారు. 234 మందిని అరెస్టు చేశారు. మిగిలిన 56 మంది పరారీలో ఉన్నారు.



- నాలుగేళ్లలో 77 గంజాయి కేసులు
- పరారీలో 56 మంది నిందితులు

పెరుగుతున్న నేరాలు..

నాలుగేళ్లలో పోలీసులు స్వాధీనం చేసుకున్న సరకు 4285.73 కిలోలు. ఇది కేవలం అధికారిక లెక్క మాత్రమే. అనధికారికంగా పట్టుబడని గంజాయి దీనికి మూడింతలు ఎక్కువగా ఉండొచ్చని అంచనా. ఇంత మొత్తంలో క్రయవిక్రయాలు జరుగుతుండటంతో నేరాలూ పెరుగుతున్నాయి. ఆకతాయిల ఆగడాలూ ఎక్కువైపోతున్నాయి. గంజాయి అక్రమ రవాణా కట్టడికి పోలీసులు చర్యలు చేపడుతున్నా పూర్తిస్థాయిలో ఫలితం ఉండట్లేదు. రెండు రాష్ట్రాల అధికారులు సమన్వయంతో మూలాలు లేకుండా చేసేందుకు నడుంబిగించాలని ప్రజలు కోరుతున్నారు.



త్వరలోనే పట్టుకుంటాం... ఒడిశాతో కలిసి సంయుక్త ఆపరేషన్లు నిర్వహించి గంజాయి అక్రమ రవాణా, వినియోగాన్ని నిలువరిస్తాం. ఇప్పటి వరకు పరారీలో ఉన్న 56 మందిని పట్టుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాం. ఎవరికైనా జిల్లాలో గంజాయికి సంబంధించి సమాచారం తెలిస్తే 100, 112 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. – కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

40 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి మహారాష్ట్రకు కారులో తరలిస్తున్న 40 కిలోల గంజాయిని దేవరాపల్లి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. గంజాయితో పాటు కారు, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై మల్లేశ్వరరావు చెప్పారు. జోలాపుట్ నుంచి దేవరాపల్లి మీదుగా గంజాయి రవాణా జరుగుతోందన్న ముందస్తు సమాచారంతో శ్రీరాంపురం కూడలిలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో వచ్చిన కారును ఆపి తనిఖీ చేయగా.. డిక్కీలో 40 కేజీల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. కొరాపుట్ జిల్లా నందపూర్‌కు చెందిన కారు డ్రైవరు మోహన్ భైరాగి, ఆయన సోదరుడు పద్మన్ కెముండి, అతుల్ సోనీని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్సై చెప్పారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

జనావాసాల్లోకి కరిరాజులు

సీతానగరం, పార్వతీపురం గ్రామీణం, బెలగాం, న్యూస్‌టుడే: ఇన్నాళ్లు కొమరాడ, జియ్యమ్మవలస, పార్వతీపురం మండలాల్లో సంచరించిన ఏనుగులు సోమవారం సీతంపేట మండలానికి చేరుకున్నాయి. సోమవారం గుచ్చిమి కొండల సమీపంలోకి రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. తాన్నసీతారాంపురం, పులిగుమ్మి, పుట్టూరు గ్రామాల మార్గంలోకి రావడంతో రాకపోకలు నిలిపేశారు. అంతకుముందు కరిరాజులు పార్వతీపురం మండలంలోని కవిటిభద్ర గ్రామంలో సంచరించి పంటలను ధ్వంసం చేశాయి.





అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి జె.సౌమ్యజోస్ఫిన్

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: చట్టాలపై మహిళలకు అవగాహన అవసరమని కురుపాం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి జె.సౌమ్య జోస్ఫిన్ అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కురుపాం కోర్టు ఆవరణలో సోమవారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మహిళల రక్షణకు రాజ్యాంగం ప్రత్యేక చట్టాలు రూపొందించినట్లు చెప్పారు. రిసోర్స్ పర్సన్లు ఎ.వి.ఎల్.పద్మజ, పి.వి.వరలక్ష్మి, పారాలీగల్ వాలంటీర్లు కోటేశ్వరరావు, మహేశ్వరి, విజయలక్ష్మి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మలగన్నమ్మ.. స్వేచ్ఛావతమ్మ

- ఇచ్ఛాపురంలో ఏటా ఘనంగా దసరా ఉత్సవాలు
- వివిధ రాష్ట్రాల నుంచి భక్తుల రాక

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఉత్కళాంధ్రుల ఇలవేల్పుగా ప్రసిద్ధి చెందిన ఇచ్ఛాపురం స్వేచ్ఛావతి అమ్మవారి నామాల్లో ఇచ్ఛావతి ఒకటి. ఆ పేరిట ఏర్పడిన గ్రామమే ఇచ్ఛాపురం. శతాబ్దాల చరిత్ర ఉన్న మహిమాన్విత నారాయణి రూపం స్వేచ్ఛావతి. అమ్మవారు శాంతి స్వరూపిణిగా ఇక్కడ దర్శనమిస్తారు. అమ్మను స్మరించి, మొక్కులు చెల్లించుకునేందుకు మన రాష్ట్రంతోపాటు పక్కనున్న ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. ఏటా దసరా సమయంలో ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తారు.



అమ్మవారి ఆలయ ముఖద్వారం వద్ద భక్తులు



అమ్మవారి కృష్ణశిలా విగ్రహం

శాంతి స్వరూపిణిగా ప్రసిద్ధి..

దసరా ఉత్సవాల్లో అమ్మవారిని నవదుర్గామాత రూపంలో కొలిచేందుకు భక్తులు ఉవ్విళ్లూరుతారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఇచ్ఛాపురం సరిహద్దు రవాణారంగ కేంద్రానికి వచ్చిన వారు ఈ నవరాత్రులలో ఒక రోజు ఇక్కడ గడిపేందుకు వస్తుంటారు. అమ్మవారిని బాలిక రూపంలోనే భక్తులు దర్శిస్తుంటారు. గిలాయివీధి, పొందరవీధి, బెల్లుపడ, ఉప్పలవీధి ప్రాంతాల్లో అమ్మవారికి ఎక్కువ అనుబంధం ఉంది. ఏడాది పొడవునా సంక్రమణ పూజలు, ప్రతి మంగళ, శుక్రవారాల్లో అభిషేకాలు ఇక్కడ ప్రత్యేకం. సాధారణంగా గ్రామదేవత అంటే జంతుబలి ఉంటుంది. అమ్మవారు శాంతస్వరూపిణి కావడంతో ఈ ఆలయంలో బలులు నిషేధం.

భక్తుల విరాళాలతో అభివృద్ధి..

ప్రస్తుత ఆలయ ప్రాంగణాలను రూ.కోట్లు వెచ్చించి భక్తులు అద్భుతంగా తీర్చి దిద్దారు. ప్రాంగణంలోనే వేంకటేశ్వర, భ్రమరాంబికా మల్లిఖార్జునస్వామి, జ్ఞానసరస్వతి, లక్ష్మీగణపతి, అయ్యప్పస్వామి, వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సూర్యనారాయణమూర్తిలను ఉప ఆలయాలలో కొలువుతీర్చి పూజలు చేస్తున్నారు. అన్నపూర్ణాదేవి మండపంలో సంక్రమణం, దసరా ఉత్సవాల సమయంలో వేలాది మందికి అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు. ఈ మండపాన్ని దర్శించడమే మహాభాగ్యంగా భక్తులు భావిస్తుంటారు.



స్వేచ్ఛావతి అమ్మవారి ప్రధానరూపం

నవరాత్రుల్లో విశేష పూజలు..

దసరా ఉత్సవాల్లో తొమ్మిది రూపాల్లో అమ్మవారిని అలంకరిస్తారు. నిత్యం ఉభయవేళల్లో శాంతి హోమాలు, 9వ రోజున పూర్ణాహుతి కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. వందల సంఖ్యలో అఖండ దీపాలు వెలిగించి, దీక్షతో భక్తులు పూజలు చేయడం ఇక్కడ విశేషం. విజయదశమి నాడు ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ నవరాత్రుల్లో ఆలయంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు.

బంధుమిత్రులు వస్తారు.. మాది ఉత్తరాది. రవాణా రంగ కేంద్రంలో జీవనం సాగించేందుకు మా తండ్రితోపాటు కుటుంబ సభ్యులందరం ఇక్కడకు వచ్చి స్థిరపడ్డాం. దసరా ఉత్సవాలకు ఉత్తరాది నుంచి మా బంధువులు అమ్మవారికి మొక్కులు చెల్లిస్తుంటారు. ఆ సమయంలో బంధుమిత్రులను కలుసుకుంటాం. ఇది అమ్మవారి మహత్యమే.
– కృష్ణ శర్మ, మున్నాసింగ్, ప్రదీప్‌నాయర్, ఇచ్ఛాపురం

నకిలీ విత్తనాలతో మోసం

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: మక్కువ మండలంలోని గిరిజన రైతులకు నకిలీ మొక్కజొన్న విత్తనాలు విక్రయించి నష్టాలకు కారణమైన వ్యాపారులపై కేసులు పెట్టాలని వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గంగునాయుడు డిమాండు చేశారు. సోమవారం రైతులతో కలిసి కలెక్టరేట్ ముందుకు ఆందోళన చేపట్టారు. 15 మంది గిరిజన రైతులు 20 ఎకరాల్లో విత్తనాలు వేసి రూ.30 వేలు చొప్పున ఎకరాకు పెట్టుబడి పెడితే ఫలసాయం రాకుండా పోయిందన్నారు. వారికి పరిహారం అందేలా వాంగ్మూలాలు నమోదు చేసి సమర్పించాలని వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్‌ను కలెక్టర్ సూచించారు.



నినాదాలు చేస్తున్న గిరిజన రైతులు